సాక్షి వికారాబాద్

సోమవారం । 11 । నవంబర్ । 2024



దిగుబడి.. దిగాలు

పత్తి దిగుబడి తగ్గింది. ఎకరాకు ఐదు క్వింటాళ్లకు మించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



అనంతుని సేవలో జడ్జి

శ్రీ అనంత పద్మనాభ స్వామి వారికి తెలంగాణ హైకోర్టు జడ్జి నగేష్ భీమపాక ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. 8లో▸



ప్రజా సంక్షేమానికి కృషి

ప్రజా సంక్షేమం కోసం ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని హన్మంతు ముదిరాజ్ పేర్కొన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

స్పెషల్ డ్రైవ్‌కు 340 దరఖాస్తులు



వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది మండలాల్లో 340 మంది దరఖాస్తు చేసుకున్నారని తహసీల్దార్ విజయ్‌కుమార్ వెల్లడించారు. రెండు రోజులు పాటు 275 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో ఫారం–6 కింద 226 మంది, ఫారం–7 కింద 61 మంది, ఫారం–8 కింద 53 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. కొందరు నూతన ఓటరుగా దరఖాస్తుగా చేసుకోగా.. మరికొందరు చనిపోయిన వ్యక్తుల వివరాలు జాబితా నుంచి తొలగించేందుకు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు.

యువత నుంచి 36 దరఖాస్తులు

ధారూరు: మండల పరిధిలోని 47 పోలింగ్ స్టేషన్లలో శని, ఆదివారాలు నిర్వహించిన కొత్త ఓటర్ల నమోదు కోసం యువత నుంచి 36 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ సాజిదా బేగం తెలిపారు. రెండు రోజుల్లో ఫారం–6 ద్వారా 36 దరఖాస్తులు, ఓటు తొలగించేందుకు ఫారం–7 ద్వారా 24 మంది దరఖాస్తు చేసుకున్నారని ఆమె వివరించారు. ఓటరు జాబితా సవరణకు ఒకరి నుంచి దరఖాస్తు అందిందన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు కిరణ్



క్రీడాకారులకు మెడల్స్ అందిస్తున్న ఓయూ డైరెక్టర్ రాజేశ్

కొడంగల్ రూరల్: ఉస్మానియా వర్సిటీలో ఆదివారం నిర్వహించిన ఇంటర్ కళాశాల టోర్నమెంట్‌లో పట్టణానికి చెందిన కటిక కిరణ్ ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. వర్సిటీలో నిర్వహించిన 800 మీటర్ల పరుగు పందెంను రెండు నిమిషాల్లో 1,500 మీటర్ల పరుగు పందెంను 4.09 నిమిషాల్లో పూర్తి చేసి సిల్వర్ పతకాన్ని సాధించాడు. ఒడిస్సాలో డిసెంబర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు కిరణ్‌కు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ.. తన విజయానికి తోడ్పాటు అందించిన కోచ్‌లు సాయిరెడ్డి, అన్వేష్, వినోద్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ

కొత్తూరు: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మత్స్యశాఖ జిల్లా అధికారి పూర్ణిమ అన్నారు. మండలకేంద్రంతో పాటు ఆయా గ్రామాల మత్స్యకారులకు ఆదివారం చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొత్తూరు మండలంలో 1.90 లక్షల చేప పిల్లలను మత్స్యకార సంఘాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వీరమోని దేవేందర్ ముదిరాజ్, అంబటి ప్రభాకర్, దయానంద్ గుప్తా, హరినాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, దేవేందర్‌యాదవ్, డోలీ రవీందర్, ఆయా గ్రామాలకు చెందిన మత్స్యశాఖ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విష ప్రచారాన్ని తిప్పికొడదాం

పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

షాద్‌నగర్: రాష్ట్రంలో కొన్ని దుష్టశక్తులు కమ్మవారిపై విషం చిమ్ముతున్నారని, విష ప్రచారాన్ని గట్టిగా తిప్పికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ పీఏసీ (పబ్లిక్ అకౌంట్ కమిటీ) చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణ శివారులోని శేషయ్యనగర్‌లో షాద్‌నగర్ కమ్మసేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక వన భోజన మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. కమ్మకులస్తులంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తద్వారా సమస్యలను సులభంగా పరిష్కరించుకోవచ్చని అన్నారు. హైదరాబాద్‌లో త్వరలో రూ.2 కోట్లతో కమ్మ భవనం నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీవన్, వెంకటేశ్వర్‌రావు, పూర్ణచందర్, ప్రాస మణి, పాతూరి వెంకటరావు, పినబాక ప్రభాకర్, వసంతరావు, నాగేశ్వర్‌రావు, జొన్నలగడ్డ శ్రీను పాల్గొన్నారు.

రేపే జాతర షురూ

మంగళవారం నుంచి మెథడిస్ట్ క్రిస్టియన్ జాతర

- ఆదివారం వరకు ఉత్సవాలు
- జిపప్‌లు, దేశ, విదేశాల నుంచి రానున్న యాత్రికులు
- 35 వేల ఎకరాల్లో 6 లక్షల మందికి నిర్వాహకుల ఏర్పాట్లు



ప్రధాన శిలువ వద్ద ఏర్పాటు చేసిన స్టేజీ

ధారూరు: లక్షలాది మంది భక్తులు హాజరయ్యే మెథడిస్ట్ క్రిస్టియన్ జాతర మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. మండల పరిధిలోని కాగ్నానది పక్కన స్టేషన్‌ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్య 101 ఏళ్లుగా నిర్వహించడం ఈ జాతర ప్రత్యేకం. ఇప్పటికే ఏర్పాట్లు చివరి దశకు వచ్చిన సందర్భంగా 6లక్షల మంది యాత్రికులు వచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. దాదాపు 35 వేల ఎకరాల స్థలంలో కాగ్నా నది పక్కన ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ ఉత్సవాలు ఆరు రోజుల పాటు కొనసాగనున్నాయి. మంగళవారం ప్రారంభమయ్యే ఈ జాతర ఆదివారం ముగుస్తుంది. బీదర్, గుల్బర్గా, రాయచూర్, సోలాపూర్, బెంగుళూర్, బెల్గాం, గోవా తదితర ప్రాంతాలతో పాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. విదేశాల నుంచి ప్రత్యేక ఆహ్వానితులు హాజరవుతారు. జాతరకు వచ్చే వీఐపీల కోసం నిర్వాహకులు తగిన సౌకర్యాలు కల్పిస్తునారు.

ఉత్సవాల విశేషాలు

మెథడిస్ట్ క్రిస్టియన్ ఉత్సవాల్లో ఏసు క్రీస్తు నామంతో కీర్తనలు, భజనలు, ప్రార్థనలు హోరెత్తుతాయి. క్రీస్తు శిలువ దగ్గర ఆరు రోజులపాటు నిత్యం ప్రార్థనలు కొనసాగుతూనే ఉంటాయి. వక్తల ప్రసంగాలు తదితర కార్యక్రమాలు కొనసాగుతాయి. జాతరకు వచ్చిన ప్రతీ భక్తుడు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హుండీల్లో బంగారం, వెండితో పాటు నగదు సమర్పిస్తారు. ఏసుక్రీస్తు పేరిట గొర్రెలు, మేకలు, కోళ్లు, కోడి గుడ్లు, ఆవులను నిర్వాహకులకు దానంగా ఇస్తారు.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

జాతర ప్రాంగణంలో ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పటిష్టమైన పోలీసులు నిఘా వ్యవస్థ ఏర్పాటు చేస్తారు. కాగ్నా నదిపై ఉన్న పాత వంతెనను తొలగించి కొత్త వంతెన నిర్మాణ పనులు జరుగుతుండటంతో డైవర్షన్ రోడ్డులో మట్టి రోడ్డును వెడల్పు చేశారు. దోర్నాల్ గ్రామం వైపు సింగిల్ బీటీ రోడ్డు పక్కనే మట్టి వేసి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చేశారు. ధారూరు, బీదర్ల మధ్యన ప్రత్యేక రైలు నడుస్తోంది. జాతర జరిగే రోజుల్లో హైద్రాబాద్–ముంబాయి మధ్యన కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ధారూరు స్టేషన్‌లో ఆగుతాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ధారూరు జాతర ప్రాంగణానికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు కొనసాగనున్నాయి. జాతర ప్రాంగణం పక్కనే ప్రవహిస్తున్న కాగ్నా నది నీరు యాత్రికుల అవసరాలను తీరుస్తోంది.



జాతర ప్రాంగణంలో ఎగ్జిబిషన్‌కు ఏర్పాట్లు

ఎగ్జిబిషన్ ఏర్పాట్లు

జాతరకు వచ్చే యాత్రికుల కోసం వ్యాపారులు ఎగ్జిబిషన్‌లో రంగుల రాట్నం, బ్రేక్ డాన్స్ తదితరాలు ఏర్పాటు చేస్తున్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చే అతిథుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. కర్రలు, చెట్టు కొమ్మలతో గుడిసెలను ఏర్పాటు చేసుకుంటున్నారు.

1922లో తొలిసారి

1921లో గుల్బర్గ నుంచి రైలులో రెవరెన్ సీమండ్స్ అతని మిత్రుడు జేటీ సీమండ్స్‌తో కలిసి హైదరాబాద్‌కు బయలుదేరారు. సాంకేతిక కారణంతో ధారూరు రైల్వేస్టేషన్‌లో రైలు మూడు గంటల పాటు నిలిచింది. దీంతో రెవరెన్ సీమండ్స్, జేటీ సీమండ్స్ రైలు దిగి కాగ్నా నది పక్కన ఇప్పచెట్టు కింద కూర్చుని ఏసు క్రీస్తు ప్రార్థన చేయగా వారి మనస్సులు నిర్మలంగా మారాయి. హైదరాబాద్‌లో తమ పని ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తయితే ఇదే స్థలంలో ప్రతీ సంవత్సరం జాతర ఉత్సవాలు నిర్వహిస్తామని వారు క్రీస్తును వేడుకున్నారు. వారికోరిక నెరవేరడంతో 1922లో వారు ప్రార్థించిన స్థలంలో ఇప్పచెట్టు కింద ఏసుక్రీస్తు శిలువను స్థాపించి జాతర ఉత్సవాలకు శ్రీకారం చుట్టారని చరిత్ర చెబుతోంది.

కేసులను వాయిదా వేయొద్దు



అడిషనల్ కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి నగేష్‌భీమాపక

- సత్వర పరిష్కారం చూపాలి
- తాండూరులో అడిషనల్ కోర్టు ప్రారంభోత్సవంలో హైకోర్టు న్యాయమూర్తి నగేష్ భీమాపాక

తాండూరు: న్యాయస్థానానికి వచ్చిన కేసులను వాయిదాలతో కాలయాపన చేయొద్దని హైకోర్టు న్యాయమూర్తి నగేష్ భీమాపాక అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలో కోర్టు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన అడిషనల్ కోర్టు, తాండూరు బార్ అసోషియేషన్ భవనాలను జిల్లా న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి, న్యాయమూర్తులతో కలిసి ప్రారంభించారు. అనంతరం తాండూరు బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశాన్ని న్యాయమూర్తి నగేష్‌భీమాపాక జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం నగేష్ భీమాపక మాట్లాడుతూ.. తాండూరు పర్యటన తనకు శ్రీరామ నవమి కోలాహలాన్ని తలపించిందన్నారు. దేశంలోని కోర్టుల్లో 3.50కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని.. రోజంతా కోర్టు నడిపించినా పరిష్కారానికి 33 ఏళ్లు పడుతుందన్నారు. న్యాయవాదులు కేసులు వాయిదా వేయకుండా పరిష్కారం చూపాలన్నారు. కొత్తగా న్యాయవాద వృత్తిలోకి వచ్చిన న్యాయవాదులు సీనియర్ న్యాయవాదులను గౌరవించాలన్నారు. 85 ఏళ్ల వయసున్న వారు సైతం ఆస్తి తగాదాలతో కోర్టును ఆశ్రయించడం శోచనీయమన్నారు. న్యాయవాదులు ఓపికతో మెలుగుతూ వృత్తి పట్ల గౌరవం పెంచుకోవాలన్నారు. తెలుగుదనం ఉట్టిపడేలా బార్ అసోషియేషన్ ప్రతినిధులు ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. పట్టణానికి చెందిన కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్‌కు బాలబాలికలు నృత్య ప్రదర్శన దర్శకుడు కే విశ్వనాథ్ సినిమా గుర్తుకు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి చంద్రకిషోర్, సెక్రెటరీ లీగల్ సెల్ అథారిటీ సీతల్, తాండూరు జూనియర్ సివిల్ జడ్జి శివలీల, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు అగ్గనూర్ శ్రీనివాస్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు సహకరించండి

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలంతా సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. ఆదివారం ఆయన వికారాబాద్ మండల పరిధిలోని నారాయణపూర్లో ఇంటింటి సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓ ఇంట్లో సర్వే జరుగుతున్న తీరును ఆయన పరిశీలించి ప్రజల నుంచి వివరాలు తెలుసుని ఫారంలో నింపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. ఎన్యుమరేటర్లు ఫామ్ లోని అన్ని విషయాలు అడిగి నమోదు చేసుకోవాలన్నారు. సందేహాలుంటే సూపర్వైజర్లతో నివృత్తి చేసుకోవాలన్నారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ సుధీర్, ఎంపీఓ దయానంద్ తదితరులు ఉన్నారు.

తప్పులు దొర్లకుండా చేపట్టండి

తాండూరు టౌన్: ఎటువంటి తప్పులు దొర్లకుండా కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తాండూరు సబ్–కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ ఎన్యుమరేటర్లను ఆదేశించారు. ఆదివారం పట్టణంలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పర్యవేక్షించారు. ఒక్కో కుటుంబాన్ని సర్వే చేయడానికి పడుతున్న సమయం, ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆరా తీశారు. ఫారంలో కోడ్‌లను సరిగా రాస్తున్నారా లేదా తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా పొందుపర్చాలన్నారు. సబ్‌కలెక్టర్ వెంట మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారి మాణిక్‌రావు తదితరులు ఉన్నారు.



అనంతగిరి: నారాయణపూర్‌లో సర్వే ఫామ్ నింపుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

భారతీయ జీవన విధానానికి రామ నామమే నాంది

శంకర్‌పల్లి: భారతీయ జీవన విధానానికి రామ నామమే నాంది అని త్రిదండి దేవనాథ రామనుజ జీయర్ స్వామి అన్నారు. మున్సిపల్ పరిధిలోని సింగాపురంలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న మరకత కార్యసిద్ధి పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతనంగా నిర్మించిన దేవాలయంలో స్వర్ణ యంత్ర స్థాపన చేసి, జయ స్తంభం, నాభి శిల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మరకత అంజనేయ స్వామి, జయ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో రామనామం, రామ భక్తుడు లేని గ్రామం లేదని స్పష్టం చేశారు. రామాయణంలో హనుమంతుడికి ఉన్న ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు.

గురుకులంలో క్రీడా వేడుక

నేటి నుంచి జోన్ లెవల్ స్పోర్ట్స్ మీట్

- కమ్మదనం గురుకుల పాఠశాలలో పోటీలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



షాద్‌నగర్‌రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గురుకుల పాఠశాలల్లో క్రీడా పండుగను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో షాద్‌నగర్ పరిధిలోని కమ్మదనం గురుకుల పాఠశాలలో సోమవారం నుంచి జోన్ లెవల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నారు.

గెలిస్తే రాష్ట్రస్థాయి పోటీలకు..

క్రీడల నిర్వహణకు గాను ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలను 20 జోన్లుగా విభజించింది. బాలబాలికలకు వేర్వేరుగా క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు బాలికలకు నిర్వహించే జోన్ లెవల్ పోటీలకు ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గురుకుల పాఠశాల వేదికగా మారింది. జోన్ లెవల్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కానున్నారు.

నిర్వహించే క్రీడా విభాగాలు

జోన్ లెవల్ పోటీల్లో వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, ఖోఖో, టెన్నికాయిట్, చెస్, క్యారంతోపాటు అండర్– 17, అండర్–19 విభాగాల్లో లాంగ్‌జంప్, హైజంప్, పరుగు పందెం తదితర పోటీలు నిర్వహించనున్నారు.

పాల్గొనున్న 1,125 విద్యార్థినులు

జోన్ లెవల్ క్రీడా పోటీలకు ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థినులు హాజరుకానున్నారు. మేడ్చల్, మల్కాజిగిరి, జగద్గిరిగుట్ట, చేవెళ్ల, బంట్వారం, మొయినాబాద్, శంకర్‌పల్లి, మహేశ్వరం, ఆమనగల్లు, నల్లకంచ, గౌలిదొడ్డి, నార్సింగి, కమ్మదనం, సరూర్‌నగర్ గురుకుల పాఠశాలలకు చెందిన 1,125 మంది పాల్గొననున్నారు.

ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు



నాలుగు రోజుల పాటు జరిగే జోన్ లెవల్ క్రీడా పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పోటీల్లో పాల్గొనే విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భోజనం, వసతి సదుపాయాలు కల్పించాం.

– విద్యుల్లత, ప్రిన్సిపాల్, కమ్మదనం గురుకులం



క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు



జలం.. ఆశాజనకం

అనూహ్యంగా పెరిగిన భూగర్భ జలమట్టం

- గత ఏడాదితో పోలిస్తే ఉబికి వచ్చిన గంగమ్మ
- పిజో మీటర్లలో ఐదు మీటర్ల లోతునే నీటి ఆనవాళ్లు
- యాసంగి సాగుపై రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఏకధాటి వర్షాలు, వరదలతో జిల్లాలోని చెరువులు, కుంటలు నిండుకుండలను తలపిస్తున్నాయి. ఫలితంగా భూగర్భ జలమట్టం అనూహ్యంగా పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి మరింత పైకి చేరుకోవడం విశేషం. బావులు, బోర్లలో చాలా తక్కువ లోతులోనే నీటి ఆనవాళ్లు కన్పిస్తుండడం.. మోటార్లు 24 గంటలు ఆగకుండా పోస్తుండటంతో రైతులు అప్పుడే యాసంగి సాగుకు సిద్ధం అవుతున్నారు. ఒకవైపు వరి కోతల్లో బిజీగా ఉంటూనే.. మరోవైపు నారు మడులను సిద్ధం చేసుకుంటున్నారు. వర్షాకాలంలో జిల్లా వ్యాప్తంగా 1,38,187 ఎకరాల్లో వరి సాగు కాగా, యాసంగిలో ఈ విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. ఈ మేరకు జిల్లా వ్యవసాయశాఖ అంచనాలు సిద్ధం చేసింది. ఎరువులు, పురుగు మందుల కొరత లేకుండా చర్యలు చేపడుతోంది.

87 పిజోమీటర్స్ ఏర్పాటు

భూగర్భ జలాలను గుర్తించేందుకు జిల్లాలో 87 పిజోమీటర్స్ ఏర్పాటు చేశారు. మే నెలలో 14.06 మీటర్ల లోతులో నీటి ఆనవాళ్లు కన్పించగా, సెప్టెంబర్ నాటికి 8.25 మీటర్లకు, అక్టోబర్ నాటికి 7.71 మీటర్లకు చేరింది. ఆమనగల్లు, అబ్దుల్లాపూర్‌మెట్, నందిగామ, బాలాపూర్, కందుకూరు, కేశంపేట, కొందుర్గు మండలాల్లోని పిజోమీటర్లలో ఐదు మీటర్ల కంటే తక్కువ లోతులోనే నీటి ఆనవాళ్లు కన్పిస్తున్నాయి. తలకొండపల్లి, ఇబ్రహీంపట్నం, మంచాల, గండిపేట, యాచారం మండలాల్లో పది మీటర్ల కంటే ఎక్కువ లోతుకు పడిపోయాయి. బహుళ అంతస్తుల నిర్మాణాలు సహా నీటి వినియోగం ఎక్కువగా ఉండే శేరిలింగంపల్లి మండలంలో గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలమట్టం ఈసారి కొంత ఆశాజనకంగా పెరిగినప్పటికీ.. నగరానికి ఆనుకుని ఉన్న కొత్తూరు, మహేశ్వరం, సరూర్‌నగర్ మండలాల్లో మరింత లోతుకు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. కొత్తగా కాలనీలు వెలుస్తుండటం.. ఇళ్ల చుట్టూ సిమెంట్ రోడ్లు వేస్తుండటంతో భూమిలోకి నీరు ఇంకని పరిస్థితి ఏర్పడింది. నిర్మాణాలు, ఇతర అవసరాలకు నీటిని తోడడం అధికంగా జరుగుతోంది. ఈ మేరకు నీరు ఇంకక పోవడంతో భూగర్భజల మట్టం మరింత లోతుకు పడిపోతోంది.

భూగర్భజల మట్టం ఇలా.. (మీటర్ల లోతులో)

మండలం	2023 అక్టోబర్	2024 అక్టోబర్
అబ్దుల్లాపూర్‌మెట్	4.98	3.66
ఆమనగల్లు	5.08	2.58
బాలాపూర్	7.02	4.50
చేవెళ్ల	7.50	7.07
చౌదరిగూడెం	6.63	9.04
ఫరూఖ్‌నగర్	7.77	7.36
గండిపేట్	10.87	10.17
హయత్‌నగర్	8.78	6.61
ఇబ్రహీంపట్నం	12.85	12.69
కద్తాల్	8.57	8.40
కందుకూరు	5.32	4.79
కేశంపేట	3.29	4.53
కొందుర్గు	4.80	5.01
కొత్తూరు	8.97	9.61
మాడ్గుల	7.33	7.22
మహేశ్వరం	8.75	9.09
మంచాల	8.25	11.23
మొయినాబాద్	6.12	7.45
నందిగామ	8.25	3.72
రాజేంద్రనగర్	6.76	5.89
సరూర్‌నగర్	7.83	8.73
శేరిలింగంపల్లి	13.90	8.52
షాబాద్	7.22	8.88
శంషాబాద్	7.13	7.44
శంకర్‌పల్లి	6.98	6.56
తలకొండపల్లి	16.32	13.10
యాచారం	11.93	10.78

క్లుప్తంగా

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

నవాబుపేట: అనుమానాస్పద స్థితిలో బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఎల్లకొండలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్నమలుపు అమరేందర్(35), అనిత దంపతులు శనివారం ఉదయం పత్తి ఏరేందుకు పొలానికి వెళ్లారు. ఈ క్రమంలో అమరేందర్ పత్తి సంచులను ఎడ్ల బండిలో తీసుకెళ్లి గ్రామానికి చెందిన మహేందర్ ఇంటి వద్ద దింపి మళ్లీ పొలానికి బయలుదేరాడు. ఎంతకీ రాకపోవడంతో భార్య పలుమార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. సాయంత్రం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అటుగా వెళ్తుండగా అమరేందర్ వ్యవసాయ క్షేత్రంలోని బావి ఒడ్డుకు చెప్పులు, ఫోన్ కనిపించడంతో సదరు వ్యక్తి అమరేందర్ భార్యకు సమాచారం ఇచ్చాడు. ఆమె వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చింది. బావిలో నీరు ఎక్కువగా ఉండడంతో ఆదివారం ఉదయం ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు రెస్క్యూ టీం బావిలోని నీటిని తోడి శవాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ

ఒకరికి తీవ్ర గాయాలు

దోమ: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్ని ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈఘటన దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గండీడ్ మండలం వెన్నచెడ్ గ్రామానికి చెందిన పెద్ద మల్కయ్య(62) మండల పరిధిలోని బడేంపల్లిలో ఓ వేడుకకు హాజరయ్యాడు. ఈ క్రమంలో నారాయణపేట జిల్లా కోస్గి మండలంలోని సంపల్లికి చెందిన బెస్త శ్రీనివాస్(50) పరిగి పట్టణంలో పని చూసుకుని తిరుగుప్రయాణమయ్యాడు. దిర్సంపల్లి అనుబంధ గ్రామం అనంతరెడ్డిపల్లి గ్రామ సమీపంలో మల్కయ్య బైక్‌ను ఎదురుగా వస్తున్న శ్రీనివాస్ తన బైక్‌తో బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో మల్కయ్యకు తీవ్రంగా గాయపడగా శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే వారిని 108 వాహనంలో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికితరలించారు. మల్కయ్య పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు చెప్పినట్లు తెలుస్తోంది. ఈ విషయ మైఎస్ఐఆనంద్ కుమార్‌ను వివరణ కోరగా.. ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

జీర్ణసంబంధ వ్యాధులకు చెక్

సాక్షి, సిటీబ్యూరో: భవిష్యత్తులో జీర్ణసంబంధమైన వ్యాధుల చికిత్సల్లో మల సంబంధమైన ఫీకల్ మైక్రోబయోటా ట్రాన్స్‌ప్లాంట్ (ఎఫ్ఎంటి) థెరపీలు ముఖ్యమైన పాత్రపోషిస్తాయని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, ఎఐజీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ దువ్వూరు నాగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం ఏఐజీ ఆస్పత్రిలో జరిగిన అంతర్జాతీయ మెడికల్ సైన్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎఫ్ఎంటీ వంటి థెరపీల ద్వారా ప్రధానంగా ఐబిడి (ఇన్ఫ్లమెటరీ బౌల్ డిసీజ్), ఐబిఎస్ (ఇరిటబుల్ బౌల్ సిండ్రోమ్), సిడిఐ వంటి వ్యాధులను నయం చేయవచ్చన్నా రు. నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ బారీ మార్షల్ మాట్లాడుతూ...ప్రస్తుతం భారతదేశంలో ప్రమాదకరంగా హెచ్ పైలూరి బ్యాక్టీరియా పెరుగుతోందన్నారు. దీని నివారణకు ప్రజల్లో చైతన్యం రావాల్సి వుందని పేర్కొన్నారు. హెచ్ పైలూరి బ్యాక్టీరియా కారణంగా అల్సర్లు, గ్యాస్ట్రోఎంటరాలజీ క్యాన్సర్లు పెరుగుతున్నాయన్నారు. సదస్సులో మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ ఎంఎస్ ఖురూ పాల్గొన్నారు.

విదేశీ విద్యపై అవగాహన పెరగాలి

సాక్షి, సిటీబ్యూరో: విదేశీ విద్యపై అవగాహన పెరిగేకొద్దీ, మరింత ఎక్కువ మంది విద్యార్థులు అంతర్జాతీయ విద్య చదవడానికి ప్రయత్నిస్తారని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. నగరానికి చెందిన టెక్సాస్ రివ్యూ ఆధ్వర్యంలో బేగంపేటలోని మారిగోల్డ్ హోటల్‌లో వరల్డ్ ఎడ్యుకేషన్ ఫెయిర్ జరిగింది. ఈ ఫెయిర్‌కు యుఎస్ఏ , యుకె , ఫ్రాన్స్, జర్మనీ సహా 13 దేశాలకు చెందిన 75 పైగా విశ్వవి ద్యాలయాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా టెక్సాస్ రివ్యూ సహ-వ్యవస్థాపకుడు సీఈఓ రాజేష్ దాసరి మాట్లాడుతూ యూఎస్, యూకె చాలా మంది విద్యార్థులకు ఇష్టపడే గమ్యస్థానాలు అయినప్పటికీ, అనేక యూరోపియన్‌దేశాలుకూడా అసాధారణమైన విద్యా ప్రమాణాలను అందిస్తున్నాయన్నారు.

దిగుబడి.. దిగాలు

రైతులకు సిరులు కురిపించే తెల్ల బంగారం దిగుబడి తగ్గింది. మార్కెట్‌లో డిమాండ్ ఉన్నా వర్షాల కారణంగా ఆశించన మేర పంట చేతికి రాలేదు. దీంతో గగ్గోలు పెడుతున్నారు.

భారీ వర్షాలకు పంట నష్టం

- ఆందోళన చెందుతున్న రైతులు



పెద్దేముల్: భారీ వర్షాల కారణంగా పత్తి దిగుబడి తగ్గింది. ఎకరాకు పది నుంచి 15 క్వింటాళ్ల వరకు రావాల్సిన పత్తి ఐదు క్వింటాళ్లకు మించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక మునుపు ఇక్కడి వ్యాపారస్తులు మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు వెళ్లి పత్తి విక్రయాలు చేపట్టేవారు. ఐదేళ్లుగా తాండూరు నియోకవర్గంలో జిన్నింగ్ మిల్లుల సంఖ్య పెరగడం.. ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలు హ్పాటు చేయడం.. దిగుబడి తగ్గిపోవడంతో మిల్లుల యజమానులు దళారులను ఆశ్రయించాల్సివస్తోంది.

డిమాండ్ ఉన్నా..

అతివృష్టి, అనావృష్టితో కారణంగా మూడేళ్లుగా రైతులు పత్తి సాగులో నష్టాలు చవిచూస్తున్నారు. భారీ వర్షాలతో పత్తి, కంది తదితర పంటలు పాడయ్యాయి. రెండేళ్లుగా పత్తి సాగు విస్తీర్ణం పెరిగింది. కంది పంట కంటే పత్తి సాగు ఎక్కువగా చేపడుతున్నారని వ్యవసాయ గణాంకాలు చెబుతున్నాయి. పెద్దేముల్ మండల పరిధిలో 12 వేల ఎకరాలకు పైగా పత్తి సాగు చేయగా.. తొమ్మిది వేల ఎకరాల వరకు కంది సాగు చేశారని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. రెండేళ్లుగా కురుస్తున్న వర్షాలకు పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తికి మార్కెట్‌లో డిమాండ్ ఉన్నప్పటికీ సరైన దిగుబడి లేదు.

ఒకే కోతలో పూర్తి

పత్తి పంట గతంలో మూడు పర్యాయాలు ఏరేవారు. ప్రస్తుతం ఒకే దశలో పూర్తవుతోంది. గతేడాదితో పోలిస్తే పెట్టుబడులు అధికమయ్యాయని.. వర్షాల కారణంగా దిగుబడి తగ్గిందని.. పెట్టుబడి వచ్చినా చాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి ఏరేందుకు కూలి రేట్లు విపరీతమయ్యాయని.. భూములు కౌలుకు ఇస్తేనే మేలని రైతులు వాపోతున్నారు.

కొనుగోలుకు జిన్నింగ్ మిల్లులు పోటీ

మండలంలో పత్తి జిన్నింగ్ మిల్లుల సంఖ్య పెరగడంతో పత్తికి డిమాండ్ పెరుగుతోంది. పత్తి పంటలు ఇంటికి రాక ముందే మధ్యవర్తులు ఇంటికి వచ్చి బయానా ఇస్తూ పంటను కొనుగోలు చేస్తున్నారు. పత్తి ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోందని రైతులు అంటున్నారు.

పత్తి ధర వివరాలు

ఏడాది	ధర(క్వింటాల్‌కు)
2022	రూ.5,725
2023	రూ.6,025
2024	రూ.7,400

అనంతుడి సేవలో హైకోర్టు జడ్జి

అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని అనంతగిరి గుట్ట శ్రీ అనంత పద్మనాభ స్వామి వారికి తెలంగాణ హైకోర్టు జడ్జి నగేష్ భీమపాక ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తిసున్నం శ్రీనివాస్‌రెడ్డి ఆయనకు పూల మొక్క అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారి మహత్యాన్ని ఆయనకు వివరించారు. తీర్థ ప్రసాదాలు ఇచ్చి ఆశీర్వచనం అందజేశారు. ఆలయం తరఫున జ్ఞాపిక బహూకరించారు. ఈ కార్యక్రమంలో



స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

ఆలయ ప్రధాన అర్చకుడు శేషగిరి శర్మ, ట్రస్టీ పద్మనాభం, ఈఓ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



న్యాయమూర్తికి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అర్చకులు

సదర్ సమ్మేళనం



సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న ఈశ్వరప్ప తదితరులు

గ్రామీణ ప్రాంతాల్లోనూ సదర్ ఉత్సవాలు నిర్వహించడం సంతోషకరమైన అంశమని బీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప అన్నారు. శనివారం రాత్రి మండల పరిధిలోని కామునిపల్లిలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం సదర్ ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం సంతోషకరం అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్, రాఘవేందర్ గౌడ్, తుప్పలి వెంకటేష్, విజయ్‌కుమార్, రాఘవేంద్ర గౌడ్, మహేష్, భీమయ్య, ప్రవీణ్, బాలకృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, బాలు, నర్సింలు, కేశవులు, బిచ్చప్ప తదితరులు పాల్గొన్నారు. – కుల్కచర్ల

కట్‌కటకు చెక్

డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్ సరఫరా

- విస్తరణ దిశగా డిస్కం అడుగులు
- కొత్తగా 72 సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు
- 46 సబ్ స్టేషన్లకు భూ కేటాయింపులు
- మిగిలిన వాటికి తప్పని కొరత



సాక్షి, రంగారెడ్డి జిల్లా: భాగ్య నగరం శరవేగంగా విస్తరిస్తోంది. శివారు ప్రాంతాల్లో కొత్త కాలనీలు, గేటెట్ కమ్యూనిటీలు, విల్లాలు, బహుళ అంతస్తులు, పరిశ్రమలు భారీగా పుట్టుకొస్తున్నాయి. ఫలితంగా ప్రతి నెలా కొత్తగా 2500–2800 విద్యుత్ కనెక్షన్లు వచ్చి చేరుతున్నాయి. గ్రేటర్‌లో 60 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా.. ప్రస్తుతం ప్రతి ఇంట్లోనూ దీపాలు, ఫ్యాన్లతో పాటు ఏసీ, కూలర్, రిఫ్రిజిరేటర్, ఇతర విద్యుత్ ఉపకరణాల వినియోగం సర్వసాధారణమయ్యాయి. ఫలితంగా కరెంట్ వాడకం గణనీయంగా పెరిగింది.

పెరిగిన వినియోగం

గతంలో ఒక కిలోవాట్‌తో సరిపెట్టుకున్న వినియోగదారులు.. ప్రస్తుతం మూడు నుంచి ఐదు కిలోవాట్ల విద్యుత్‌ను ఖర్చు చేస్తున్నారు. ఫలితంగా 2023లో గ్రేటర్ సగటు విద్యుత్ వినియోగం 3,756 మెగావాట్లు ఉండగా, 2024లో 4,352 మెగావాట్లకు చేరుకుంది. రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ మేరకు ఇప్పటికే మెట్రో జోన్‌లో 37, మేడ్చల్ జోన్‌లో 27, రంగారెడ్డి జోన్‌లో 57 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల (పీటీఆర్) సామర్థ్యాన్ని 12 ఎంవీఏలకు పెంచారు. అయినా సబ్‌స్టేషన్లలోని ఫీడర్లపై ఒత్తిడి తగ్గలేదు. సరఫరాలో హెచ్చుతగ్గుల సమస్య తీరడం లేదు. కనీస అంతరాయాలకు అవకాశం లేకుండా భవిష్యత్తులో మరింత మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేయాలంటే అదనపు సబ్‌స్టేషన్లు నిర్మించాల్సిందేనని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ నిర్ణయించింది.

గ్లోబల్ టెండర్లు

గ్రేటర్‌లోని పది సర్కిళ్ల పరిధిలో 72 కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వీటిలో ఇప్పటికే 46 సబ్‌స్టేషన్లకు స్థల లభ్యత ఉంది. మిగిలిన వాటికి స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి విద్యుత్ పంపిణీ సంస్థ కోరింది. స్థల కేటాయింపు పూర్తి కావడమే ఆలస్యం సబ్‌స్టేషన్ల నిర్మాణానికి టెండర్లు పిలవనుంది.

అంచనాలు పెంచి..

ఇండోర్/అవుట్ డోర్ సబ్‌స్టేషన్ల పనుల సత్వర పూర్తి, నాణ్యత కోసం గతానికి భిన్నంగా ఈసారి గ్లోబల్ టెండర్లను ఆహ్వానించాలని డిస్కం నిర్ణయించినట్లు తెలిసింది. ఆ నిర్ణయాన్ని ప్రైవేటు కాంట్రాక్టర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. డిస్కం చర్యలతో ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి తలెత్తిందనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా కాంట్రాక్టర్ల మధ్య ఉన్న పోటీతో డిస్కం నిర్ణయించిన ధర కంటే తక్కువకే టెండర్ కోట్‌చేసే అవకాశం ఉంది. దీంతో సంస్థకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. కానీ డిస్కం ఈ అంశాన్ని పట్టించుకోకుండా ఉన్న అంచనాలను 20 శాతానికి పెంచి ప్రభుత్వంలోని పెద్దలకు, కార్పొరేట్ కంపెనీలకు పనులు కట్టబెట్టేందుకు యత్నిస్తోందనే ప్రచారం జరుగుతోంది.

ప్రతిపాదిత సబ్‌స్టేషన్లు

సర్కిల్	ప్రతిపాదిత	భూమి కేటాయించినవి
రాజేంద్రనగర్	13	09
సరూర్‌నగర్	05	04
సైబర్‌సిటీ	07	05
సంగారెడ్డి	12	12
మేడ్చల్	04	03
హబ్సిగూడ	04	04
హైదరాబాద్ సౌత్	12	02
హైదరాబాద్ సెంట్రల్	09	01
బంజారాహిల్స్	05	03
సికింద్రాబాద్	14	02

గ్రామాలాభివృద్ధితోనే దేశాభివృద్ధి

స్వదేశీ జాగరణ్ మంచ్ రాష్ట్ర కోకన్వీనర్ ఈశ్వర్

పరిగి: గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమని స్వదేశీ జాగరణ్ మంచ్ రాష్ట్ర కోకన్వీనర్ ఈశ్వర్ అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో స్వదేశీ జాగరణ్ మంచ్ సంఘం నాయకులతో సమావేశం ఏర్పాటుచేసి దత్త జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 500 సంవత్సరాల క్రితం భారతదేశం స్వయం సమృద్ధి దేశంగా ఉండేదన్నారు. కాలక్రమేణ ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితికి వచ్చిందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా భారత దేశంలో పరిస్థితి చాలా మెరుగుపడిందన్నారు. ప్రపంచాన్ని వణికించిన కరోనా వ్యాక్సిన్‌ను భారతదేశం తయారు చేసి ఇతర దేశాలకు పంపిణీ చేసిందన్నారు. అన్నింటిలో భారతదేశం ఎంతో ముందుకు సాగుతుందన్నారు.



మాట్లాడుతున్న సంఘం నాయకులు

గ్రామాల్లోని యువకులు స్వయం సంవృద్ధిని సాధించి దేశ ఆర్థిక అభివృద్ధికి తమ వంతు భాగస్వామ్యం కావాలన్నారు. వ్యాపార ఆసక్తి ఉన్న యువతకు సంఘం తరుపున శిక్షణ ఇచ్చి తీర్చిద్దడమే స్వదేశీ జాగరణ్ మంచ్ ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో పాలమూరు విభాగ్ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులు, వెంకటయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిప్పు.. కలగదా కనువిప్పు!

- పరిశ్రమల్లో తరచూ అగ్ని ప్రమాదాలు
- భద్రతలో యాజమాన్యాల నిర్లక్ష్యం
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- భుగ్గిపాలవుతున్న కార్మికుల జీవితాలు



నందిగామలోని అలైన్ ఫార్మా హెర్బల్ పరిశ్రమలో అగ్నిప్రమాదం (ఫైల్)

షాద్‌నగర్: పరిశ్రమల్లో నిత్యం ఎక్కడో ఓచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రూ.కోట్లలో ఆస్తులు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. కార్మికుల జీవితాలు భుగ్గిపాలవుతున్నాయి. కళ్ల ముందే తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అటు అధికారులు గానీ, ఇటు పరిశ్రమ యజమానులు కాని కళ్లు తెరవడం లేదు. నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. ఫలితంగా కార్మికుల బతుకులు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి.

ఇవీ కొన్ని ఘటనలు..

- గత వారం షాద్‌నగర్ పరిధిలోని నందిగామలో సర్వేంద్రిగూడ రహదారిలో డైపర్లు తయారు చేసే క్యాంసస్ హైజనేర్ పరిశ్రమలో షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. సుమారు రూ.30 కోట్ల ఆస్తినష్టం జరిగింది.
- గత ఏప్రిల్‌లో నందిగామలో పాత జాతీయ రహదారి పక్కన ఉన్న అలైన్ ఫార్మా హెర్బల్ పరిశ్రమలో హోమియోపతి మందులు తయారు చేసే పరిశ్రమలో ఇనుప రేకుల షెడ్ కింద వెల్డింగ్ చేస్తుండగా నిప్పు రవ్వలు స్పాంజ్, థర్మాకోల్ షీట్లపై పడడంతో భారీ ఎత్తున మంటలు వ్యాపించాయి. ఈ రెండు ఘటనల్లో కార్మికులు ప్రమాదాల నుండి తృటిలో తప్పించుకున్నారు.
- అంతకు ముందు బూర్గుల పరిధిలోని రంగులు తయారు చేసే పరిశ్రమలో ప్రమాదం జరిగి సుమారు ఐదుగురు కార్మికులు మృత్యువాత పడ్డారు.
- కొందుర్గు మండల శివారులోని స్పాంజ్ ఐరన్ పరిశ్రమలో బాయిలర్ పేలడంతో సుమారు పది మంది కార్మికులు గాయపడ్డారు.

అయినా కళ్లు తెరవరా..?

పరిశ్రమల్లో కార్మికుల రక్షణ, భద్రతా చర్యలు చేపట్టడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. ప్రమాదాల నివారణ, కార్మికుల భద్రత తదితర అంశాలకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ విభాగం అధికారులు తనిఖీలు చేపట్టాలి. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేసే అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పరిశ్రమల్లో పని చేస్తున్న ప్రతి కార్మికుడి రక్షణకు పూర్తి బాధ్యత వహించాల్సిన యజమానులు వారి స్వలాభం చూసుకుంటున్నారు తప్ప కార్మికుల భద్రతను పట్టించుకోవడం లేదు.

ప్రమాదాలకు కారణాలు..

పరిశ్రమల్లో అగ్నిమాపక ఏర్పాట్లు సరిగా లేకపోవడం.. షార్ట్‌సర్క్యూట్.. రసాయనాలు.. ఫైబర్ వంటి వస్తువులను నిల్వ చేయడం.. సిలిండర్ పేలుళ్ల వంటివి ప్రమాదాలకు ఎక్కువగా కారణం అవుతున్నాయి. పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వకపోవడంతో ప్రమాదాల బారినపడినప్పుడు మృత్యువాత పడుతున్నారు.

అప్రమత్తతే ప్రధానం

అగ్ని ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలను అత్యంత పటిష్టం చేయడంతో పాటు వీటికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అగ్నిమాపక సిబ్బంది సైతం అత్యాధునిక పద్ధతులు, పరికరాలు అందిపుచ్చుకోవాలి. పరిశ్రమల్లో భారీ ఎత్తున నీటి సామర్థ్యం ఉండే ట్యాంకులను నిర్మించుకోవాలి. నీటిని తోడేందుకు మోటార్లను అమర్చి సిద్ధంగా ఉంచాలి. తద్వారా అగ్ని ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుంది. కోట్లాది రూపాయల విలువైన ఆస్తులు, అంతకంటే విలువైన మనుషుల ప్రాణాలను రక్షించుకోవడానికి వీలవుతుంది.

విగ్రహాల ధ్వంసం కేసులో నిందితుడి అరెస్టు

శంషాబాద్ రూరల్: మండలంలోని జూకల్ గ్రామంలోని ఆలయాల్లో విగ్రహాల ధ్వంసం కేసులో నిందితుడిని చేసిన పోలీసులు అరెస్టు చేసి ఆదివారం కోర్టులో హాజరుపర్చారు. జూకల్‌లో శనివారం రాత్రి ఓ యువకుడు చౌడమ్మ, సోమన్న ఆలయాల్లోని విగ్రహాలను ధ్వంసం చేయడంతో పాటు వస్త్రాలను తొలగించాడు. గమనించిన స్థానికులు అతన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇతను మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లా సవ్దేడా గ్రామానికి చెందిన సల్మాన్ అర్మాన్ తాడ్వీగా పోలీసుల విచారణలో తేలింది. ఇతనిపై గతంలో రాయ్‌గడ్ జిల్లా తాల పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం, ఇంటికి నిప్పు పెట్టిన కేసు నమోదు అయింది. ఈ కేసులో జైలుకు సైతం వెళ్లాడు. జూకల్ ఘటనలో ఇతనిపై కేసు నమోదు చేసిన పోలీసులు అతన్ని కోర్టులో హాజరు పర్చగా రిమాండ్‌కు పంపారు.

వడ్డీ డబ్బుల విషయమై గొడవ

బావను చంపిన బావమరిది

మైలార్‌దేవ్‌పల్లి: వడ్డీ డబ్బుల విషయమై జరిగిన గొడవలో సహనం కోల్పోయిన బావమరిది.. బావ తలపై బండరాయి బాదడంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నరేందర్ చెప్పిన వివరాల ప్రకారం.. వట్టేపల్లి ప్రాంతానికి చెందిన సైఫ్ (39) ప్రైవేట్ ఉద్యోగి. అతడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. సైఫ్ బావమరిది ఆటోడ్రైవర్ మహమ్మద్ ఇస్మాయిల్ ఇదే ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. వీరి మధ్య కొంతకాలంగా డబ్బుల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. బావమరిది ఇస్మాయిల్ వద్ద సైఫ్ రూ.లక్ష అప్పు తీసుకున్నాడు. ఈ డబ్బులకు సైఫ్ కొన్ని రోజులు వడ్డీ సక్రమంగానే కట్టాడు. ఇటీవల కొన్ని రోజులుగా కట్టకపోవడంతో ఆదివారం బావ, బావమరిది మధ్య గొడవ జరిగింది. మాటామాటా పెరిగి బావ సైఫ్ తలపై ఇస్మాయిల్ బండరాయితో బాదాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో సైఫ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పి.. చెట్టును ఢీకొట్టి.. బోల్తా కొట్టి

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం
- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు

యాచారం: అతి వేగంతో వెళ్తున్న కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టి, బోల్తా కొట్టడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలై నగరంలోని వివిధ ప్రవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదరాబాద్-శ్రీశైలం రహదారి ముచ్చర్ల గేట్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. సీఐ లిక్కి కృష్ణంరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పహాడీషరీఫ్‌కు చెందిన ఇంతియాజ్ ఖాన్ (18), నాయబ్ ఖాన్ (18) తమ స్నేహితులైన అబ్దుల్ సమీర్, అబ్దుల్ షియాజ్ ఖాన్, అబ్దుల్ అజీజ్ ఖాన్, అబ్దుల్ ఖాదర్, అబ్దుల్ పయాజ్‌తో కలిసి మెహిదీపట్నంలోని ఓ ట్రావెల్స్‌కు చెందిన కారు (టీఎస్ 09ఈహెచ్ 0362)ను అద్దెకు తీసుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున శ్రీశైలం ప్రాజెక్టు సందర్శనకని బయలుదేరారు. అబ్దుల్ సమీర్ కారు నడుపుతున్నాడు. కారు అతి వేగంగా వెళ్తూ శ్రీశైలం రహదారిపై ముచ్చర్ల గేట్ సమీపంలో చెట్టుకు బలంగా ఢీకొట్టి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఇంతియాజ్ ఖాన్, నాయబ్ ఖాన్‌ను నగరంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. మిగతా ఐదుగురికి తీవ్ర గాయాలు కావడంతో నగరంలోని వివిధ ఆస్పత్రుల్లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. నిద్రమత్తులో కారును అతి వేగంగా డ్రైవ్ చేయడం వల్లే ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

కాప్రాలో కారు బీభత్సం

మద్యం మత్తులో కారు నడిపిన యువకుడు

- పదుల సంఖ్యలో వాహనాలను ఢీ కొట్టిన కారు..
- 15 మందికి పైగా గాయాలు
- దేహశుద్ధి చేసిన స్థానికులు

కుషాయిగూడ: మద్యం మత్తులో ఉన్న యువకుడు కారు నడుపుతూ బీభత్సం సృష్టించాడు. అదుపుతప్పి సుమారు రెండు.. మూడు కిలోమీటర్ల మేర ద్విచక్ర వాహనాలు, కార్లు, పాదచారులను ఢీకొడుతూ పలువురిని గాయపరిచాడు. స్థానికులు వెంబడించి కారు నడుపుతున్న యువకుడిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన ఆదివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాప్రాలో చోటు చేసుకుంది. నేరేడ్‌మెట్‌కు చెందిన యువకుడు లోకేష్ మరో యువతితో కలిసి మద్యం తాగాడు. మద్యం మత్తులో కారును అతి వేగంగా నడుపుతూ వాహనాలను ఢీ కొడుతూ బీభత్సం సృష్టించాడు. కందిగూడ, కాప్రా లేక్ ప్రాంతాల నుంచి నేతాజీనగర్ చౌరస్తా వరకు పదుల సంఖ్యలో వాహనాలు, పాదాచారులను ఢీ కొట్టి భయాందోళనలకు గురిచేశాడు. కొంతమంది యువకులు కారును వెంబడించి ఏఎస్‌రావునగర్ ఏటీసీ వద్ద పట్టుకొని కారు నడుపుతున్న యువకుడికి దేహశుద్ధి చేశారు. ఈ క్రమంలో ఏఎస్‌రావునగర్ ప్రధాన రోడ్డు మార్గంలో సుమారు రెండు గంటల పాటుగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలిసిన కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ అంజయ్య సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మద్యం మత్తులో ఉన్న లోకేష్‌ను, కారును అదుపులోకి తీసుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. గాయపడ్డ వారు స్థానిక ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నారు. స్వల్పగాయాలతో బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాగా యువకుడితో పాటుగా కారులో ఉన్న యువతి కూడ మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది.